
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 10 సెప్టెంబరు 2025



కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్‌శైల్ అరెస్ట్



బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారవార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్శైల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఆగస్టు 14న ఎమ్మెల్యే నివాసం, కార్యాలయంపై దాడులు నిర్వహించిన రూ.1.68 కోట్ల నగదు, 6.75 కేజీ బంగారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.14.13 కోట్లు అక్రమ ఆస్తులు గుర్తించారు.



బ్యాలెట్..!



- స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం
- బ్యాలెట్‌లోనే జరపాలని ప్రభుత్వ నిర్ణయం
- గవర్నర్ బిల్లు ఆమోదించేనా..?
- రాష్ట్రపతి చెంతకు తప్పదా..!

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు పాలకవర్గాలు ఉంటేనే అభివృద్ధి వేగవంతంగా అమలు చేసేందుకు సాధ్యమనే సంగతి తెలిసిందే. పాలనా సౌలభ్యం కొరకే గ్రామపంచాయతీలు, పట్టణ, నగర పంచాయతీలు, జిల్లా పంచాయతీలు, ఆపై నగర పాలికె, మహానగర పాలికెలవంటివి ఏర్పాటు చేశారు. సాధారణంగా ఐదేళ్లకోసారి ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. పాలకవర్గం గడువు ముగిసేందుకు మూడు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి గడువు ముగిసేలోగా కొత్త పాలకులను ఖరారు చేయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు ఎప్పుడూ సజావుగా జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. అందుకు పలు కారణాలు లేకపోలేదు. కోర్టు కేసులు, రిజర్వేషన్ల వివాదం వంటి కారణాలతో వాయిదాలు పడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీలతో పాటు గ్రేటర్ బెంగళూరు పరిధిలోని ఐదు పాలికెలతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరపాల్సి ఉంది. ఇప్పటికే పాలకవర్గం గడువు ముగియడంతో అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

ఇటీవల కొన్నేళ్లుగా స్థానిక సంస్థలతోపాటు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారానే కొనసాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ రూపంలో జరిపేలా మంత్రివర్గం తీర్మానించింది. ఈవీఎంల ద్వారా ఎటువంటి ఇబ్బంది లేకుండా గడువులోగా స్థానిక సంస్థలు కష్టమని అనిపిస్తున్న తరుణంలో ఏకంగా ఈవీఎంలు కాదని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలనే తీర్మానం తో మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇదే కారణంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయాలనే

ఆర్డినెన్స్ అయినా ఆమోదించాల్సిందే

ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు లేనందున మంత్రివర్గంలో తీసుకున్న బ్యాలెట్ పేపర్ల ఎన్నికల చట్టం తీసుకొచ్చేందుకు ఆర్డినెన్స్ జారీ చేయాల్సి ఉంటుంది. ఆర్డినెన్స్ జారీ చేసినా గవర్నర్ ఆమోదించాల్సి ఉంటుంది. గవర్నర్ ప్రభుత్వ నిర్ణయానికి అంగీకారం తెలపకుండా, రాష్ట్రపతికి బిల్లులు పంపితే అక్కడ నుంచి బిల్లుపై నిర్ణయం ఎంతకాలానికి అవుతుందనేది చెప్పడానికి సాధ్యం కాదు. ఇటువంటి కారణాలతో ఎన్నికలను మరింతకాలం వాయిదా వేసేందుకు వీలుంటుంది.

ఇది సాధారణ బిల్లు కాదు

ప్రభుత్వ పాలనకు అనుగుణంగా శాఖలవారీగా చట్టాలను బిల్లుల రూపంలో సవరణలు చేసి కొత్త విధానాలు తీసురాదలిచారు. శాసనసభ ఉభయసభలలో బిల్లులకు ఆమోదం పొందుతారు. ప్రభుత్వానికి శాసనసభలో మెజారిటీ ఉన్నందున సులభతరంగానే బిల్లులకు ఆమోదం సాధ్యమవుతుంది. కానీ పరిషత్‌లో మెజారిటీ లేకపోవడంతో తిరస్కరణకు గురవుతాయి. రెండోసారి శాసనసభ ముందు ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంటారు. ప్రస్తుత మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం అంత సులువైనదికాదు. బిల్లు రాజ్‌భవన్‌కు చేరిన వెంటనే గవర్నర్ ఆమోదింపచేస్తారనేది అనుమానమే అనిపిస్తోంది. పైగా దేశమంతటా అమలు చేస్తున్న ఒక విధానాన్ని కాదని తిరిగి పాతపద్ధతిలోకి వెళ్లి బ్యాలెట్ ఎన్నికలకు పార్టీపరంగా కాకుండా భిన్నమైన వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తాయా..? అనేది కీలకం.

నవంబరులో ఎన్నికలు సాధ్యమేనా..?

సాధారణంగా ఏ విషయంలోనైనా అప్‌గ్రేడ్ కావాలని భావిస్తారు. ప్రత్యేకించి డిజిటల్ రంగమైన ఐటీబీటీలో ప్రపంచంలోనే పేరొందిన నగరంగా రాణిస్తున్న బెంగళూరు రాజధానిగా ఉండే రాష్ట్రంలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు జరపాలనే ప్రభుత్వ నిర్ణయంపైనా ప్రతిపక్షాలతోపాటు వివిధ రంగాల నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఐటీబీటీలో ప్రపంచానికి ఆదర్శమని చెప్పుకొంటూ ఎన్నికల ఓటింగ్ మిషన్లలో అవినీతి జరుగుతుందనే ఆరోపణలను నిపుణులు తిప్పికొడుతున్నారు. రెండేళ్లక్రిందట అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఉనికి లేదనేరీతిలో ప్రజాతీర్పు సాధ్యమైంది. కాంగ్రెస్‌కు 135మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. ప్రభుత్వం ఏర్పడాలంటే మ్యాజిక్ నెంబరు 113తోనే సాధ్యమవుతుంది. కానీ అంతకుమించి 22మంది ఎమ్మెల్యేలు అత్యధికంగా గెలుపొందారు. ఈ ఎన్నికలు ఈవీఎంల ద్వారానే జరిగాయి. అటువంటిది కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలను వద్దనుకునేందుకు కారణాలు ఏమిటనేది స్పష్టంగా లేదు. బీబీఎంపీకి మరో పాలకవర్గం ఏర్పాటైనా గడువు ముగిసిండేది. ఇలా ఏళ్ల తరబడి ఎన్నికలు జరగలేదు. జిల్లా, తాలూకా పంచాయతీలకు ఎన్నికలు ముగిసి నాలుగేళ్లు అయ్యింది. 5,950 గ్రామపంచాయతీలకు 2026 జనవరిలో పాలకవర్గం ముగుస్తుంది. అంతా ఈ ఏడాది నవంబరులో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో అటువంటి ప్రక్రియ సాధ్యం కాదనిపిస్తోంది.

బీజేపీపై మండిపడుతున్న ప్రభుత్వం

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేకంగా ఓటరు జాబితా తయారు చేసుకోవాలని రాజ్యాంగంలో ఎక్కడా పొందుపరచలేదని అభిప్రాయపడుతోంది. ఉత్తరప్రదేశ్, కేరళతోపాటు పలు రాష్ట్రాలలో ప్రత్యేక ఓటరు జాబితా ఉన్నప్పుడు కర్ణాటకలో ఎందుకు ఉండరాదని ప్రశ్నిస్తోంది. ఈవీఎంలపై అనుమానంతో బ్యాలెట్ వినియోగిస్తే బీజేపీకి ఎందుకు గందరగోళమని ప్రశ్నిస్తోంది. ఈవీఎంలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యిందని, పలు చోట్ల నిరసనలు కొనసాగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో అక్రమాలు బయట పడుతున్నాయని, దీనిపై తమ నేత రాహుల్ గాంధీ కూడా ఆందోళన చేపట్టారన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తమ తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదన్నారు.





గ్రామ పంచాయతీ కార్యాలయం

బీజేపీ వాదన ఇలా..

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) ల ట్యాంపరింగ్ అనేది అసాధ్యమని రుజువైంది. ఇప్పటికే పలుమార్లు పరిశీలన చేసినా ఎక్కడా ఈవీఎంలలో ట్యాంపరింగ్ జరగలేదని రుజువైంది. ఈవీఎంలకు సంబంధించి పలు ప్రాంతాల్లో కోర్టు తీర్పులు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ పదే పదే ఈవీఎంలను పరీక్షించి ప్రజలలో నమ్మకం తీసుకొచ్చింది. కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టుగా ఈవీఎంల వల్ల అక్రమాలు జరిగి ఉంటే దక్షిణభారత్‌లోనే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులలో ఎలా గెలిచారని ప్రశ్నిస్తోంది.

ప్రక్రియ కొనసాగేది ఇలా..

జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ, గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలోని ఐదు పాలికెలకు ఎన్నికలు... ఓటరు జాబితాకోసం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. ఎన్నికలలో విశ్వాసం తీసుకొచ్చి పారదర్శకతకు బ్యాలెట్ విధానం అమలు చేశామని వివరించాల్సి ఉంటుంది. న్యాయశాఖ అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటిపైనా చర్చకు 11న గురువారం మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. నాలుగు గెజిట్ నోటిపికేషన్‌లపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రివర్గంలో ఏకాభిప్రాయం అయితే బిల్లు రాజ్‌భవన్‌కు చేరనుంది. మంత్రివర్గంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే మంత్రివర్గ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి బిల్లుపై చర్చించి, అభిప్రాయ సేకరణ చేసి తదుపరి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

భువనేశ్వరి మాతపై అనుచిత వ్యాఖ్యలు

- కన్నడ పతాకాన్ని అవమానించారు
- బానుముస్తాక్‌పై హిందూ సంఘాల ఆగ్రహం
- చలో చాముండిని అడ్డుకున్న పోలీసులు



రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల కార్యకర్తలు

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలను రచయిత్రి బానుముస్తాక్ ప్రారంభించేలా ప్రభుత్వం తీర్మానించడంపై హిందూ జాగరణ వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చలో చాముండి పేరిట మంగళవారం నిరసనకు సిద్ధమయ్యారు. పాదయాత్రలో భాగంగా మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ మీడియాతో మాట్లాడుతూ 2023లో ఓ సభలో రచయిత బాను ముస్తాక్ కన్నడమాత భువనేశ్వరి పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేశారని, కన్నడ జెండాను పసుపు, కుంకుమలతో రూపొందించారని ఇక తనకు ఎక్కడ చోటు అంటూ వ్యాఖ్యానించారన్నారు. కన్నడ మాతను, జెండాను గౌరవించకుండా ముల్లా తరహాలో మాట్లాడే బానుముస్తాక్ ద్వారా దసరా ఉత్సవాలు ప్రారంభించడం సమంజసమా అని ప్రశ్నించారు. సహజకవి నిసార్ అహ్మద్‌తో పోల్చరాదన్నారు. ఆయన శ్రీకృష్ణుడిపైనా చేసిన రచనలు అద్భుతమన్నారు. ఇదే సందర్భంగా పోలీసులు పాదయాత్రను అడ్డుకున్నారు. రాష్ట్రమంతటా హిందూ వ్యతిరేక విధానాలు పెరిగాయని మండిపడ్డారు. ప్రతాప్‌సింహతోపాటు స్థానిక నేతలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా బెంగళూరు సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ బీజేపీ వారికి కుట్రలు పన్నడమే విధి అన్నారు. చలో చాముండి అంటూ రాజకీయం చేసేందుకు ప్రయత్నించారన్నారు. మద్దూరులో గొడవకు కారకులైన 21మందిని అరెస్టు చేశామన్నారు. కులమతాలతో సంబంధం లేకుండా తప్పుచేసిన వారందరినీ అరెస్టు చేశామన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు దారితప్పాయి

- కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ నేతల ఫిర్యాదు



కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన రాష్ట్ర బీజేపీ నేతల బృందం

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు దారి తప్పాయని కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర బీజేపీ నేతలు వివరించారు. ఢిల్లీలో సోమవారం రాత్రి కేంద్ర హోం మంత్రిని రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలతో కలసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి భేటీ అయ్యారు. ధర్మస్థలలో వ్యూహాత్మక కుట్ర బయటపడుతోందన్నారు. దసరా ఉత్సవాల విషయంలో రాష్ట్రప్రభుత్వం హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. వినాయక నిమజ్జనం వేళ పోలీసులు ఇష్టారాజ్యంగా లాఠీచార్జ్ చేశారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారితప్పుతున్నాయని వివరించారు. సమాజంలో గొడవలకు కారకులైనవారిపైన నమోదైన కేసులను ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను రాష్ట్ర బీజేపీ నేతలు భేటీ కావడంపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా స్పందించారు. బీజేపీ నేతలు ప్రతీదీ రాజకీయం చేయాలని చూస్తారన్నారు. మణిపురలో ఏళ్ల తరబడి హింస కొనసాగుతుంటే ప్రధానమంత్రి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. రైతులు ఏళ్ల తరబడి రోడ్డుపై పోరాటం చేయలేదా.. అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎటువంటి ఢోకా లేదన్నారు.



మద్దూరులో ఓ ప్రార్థనా మందిరం ముందు పోలీసులు

మద్దూరు ప్రశాంతం

- నేడు వినాయక నిమజ్జనం
- దాడిపై సమగ్ర దర్యాప్తు : ఐజీ బోరలింగయ్య

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినాయక శోభాయాత్రవేళ ఆదివారం రాత్రి చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల తర్వాత మంగళవారం మద్దూరులో ప్రశాంతత అనిపించింది. వాస్తవానికి హిందూ జాగరణ వేదిక బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే పోలీసులు ముందుజాగ్రత్తగా సంపూర్ణంగా బంద్ పాటింపచేశారు. 144వ సెక్షన్ అమలు చేయడంతో ఎటువంటి కార్యక్రమాలు కొనసాగలేదు. పోలీసు బందోబస్తు యథావిధిగా కొనసాగుతోంది. మరోవైపు బుధవారం వినాయక నిమజ్జనం నిర్వహించనున్నారు. ఆదివారం నిమజ్జనం కాని 28 విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నారు. మంగళవారం బీజేపీ నేత ఎస్‌పీ స్వామి మీడియాతో మాట్లాడుతూ బుధవారం జరిపే శోభాయాత్రలో 20వేలమందికిపైగా పాల్గొంటారన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు భాగస్వామ్యులు అవుతారన్నారు. శోభాయాత్ర మార్గాలను పోలీసులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదే విషయమై చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ బ్రిటీష్‌కాలంలోనూ గణపతి ఊరేగింపునకు స్వాతంత్ర్యం ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో వినాయక వేడుకలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఒక మతం ఓటుబ్యాంకుకోసం ఇలా ప్రోత్సహించడం సరికాదన్నారు. హిందువుల పండుగలకు వంద ప్రశ్నలు వేస్తారన్నారు. చిక్కబళ్ళాపురలో ఒక లౌడ్ స్పీకర్ అమర్చాలంటే ఎస్పీ అనుమతి కావాలన్నారు.

కుట్ర కోణంపై విచారణ: ఐజీ బోరలింగయ్య



మద్దూరులో హింసాత్మకం వెనుక కుట్రలను పరిశీలిస్తున్నామన్నారు. లైట్లు ఆఫ్ చేయడమే అనుమానం కలిగిస్తోందన్నారు. ఇది ముందస్తు వ్యూహం అనే అనుమానాలు ఉన్నాయని దక్షిణ డివిజన్ ఐజీపీ బోరలింగయ్య తెలిపారు. ప్రస్తుతం ప్రశాంతంగా ఉందని 22మందిని అరెస్టు చేశామన్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు.

4,108 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

- చిత్తాపుర బీజేపీ నాయకుడు నరేంద్ర రైస్ మిల్లుపై దాడులు
- నకిలీ లేబుళ్లతో విదేశాలకు తరలిస్తున్నట్లు గుర్తింపు

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చౌకడిపో బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విదేశాలకు తరలించే గుట్టును అధికారులు రట్టు చేశారు. యాదగిరి జిల్లా గురుమిట్కల్‌లోని ఓ రైసుమిల్లుపై పౌర ఆహార సరఫరాలశాఖ అధికారులు సోమవారం దాడులు చేశారు. రూ.1.17 కోట్ల విలువైన సుమారు 4108 క్వింటాళ్ల చౌకబియ్యాన్ని సీజ్ చేశారు. రైస్‌మిల్లు నరేంద్ర రాథోడ్, అయ్యప్ప రాథోడ్‌లకు చెందినదిగా గుర్తించారు. నరేంద్ర రెండేళ్ల క్రిందట చిత్తాపుర శాసనసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. చౌకధాన్య బియ్యాన్ని నిల్వ చేసి పాలిష్ చేసి వివిధ పేర్లతో లేబుళ్లతో విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు పౌర ఆహార సరఫరాలశాఖ సీనియర్ అధికారి అనిల్ డవళగె తెలిపారు. శనివారం ప్రారంభించిన ప్రక్రియ సోమవారం సాయంత్రంతో ముగిసిందన్నారు. చౌకబియ్యం రవాణాలో ఎవ్వరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు.



ఊరేగింపులో హనుమంతుడు

ప్రశాంతంగా గణేశ నిమజ్జనం

కంప్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : కంప్లి పట్టణంలో సోమవారం రాత్రి హిందూ గణపతి లయన్స్ గణపతి నిమజ్జనం కార్యక్రమం భారీ పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి, ఏఎస్‌పీ నవీన్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐలు, ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, హోంగార్డులు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి చెదురుముదురు ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. పట్టణంలోకి ఎలాంటి వాహనాలు రాకుండా నిలిపివేశారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి నిమజ్జనం ముగిసే వరకు అక్కడే ఉండి పరిశీలించారు. ఎమ్మెల్యే గణేష్ పాల్గొని హిందూ గణపతి, లయన్స్ గణపతికి పూజలు నిర్వహించారు. కళాకారులు పూర్తిగా ఆకట్టుకున్నారు. సంగీత పాటాలకు యువకులు నృత్యాలు అలరించారు. హిందూ గణపతి ఊరేగింపు కార్యక్రమంలో ఆంజనేయస్వామి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది.



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్



నాగేంద్ర ప్రసాద్, బళ్లారి కలెక్టర్



కవిత ఎస్.మణ్ణికెరి, విజయనగర జిల్లా కలెక్టర్

ఉభయ జిల్లాల కలెక్టర్ల బదిలీ

బళ్లారి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎంఎస్ దివాకర బదిలీ అయ్యారు. వీరి స్థానంలో బళ్లారి జిల్లాకు నాగేంద్ర ప్రసాద్. కే, విజయనగర జిల్లాకు కవిత ఎస్. మణ్ణికేరిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాగేంద్ర ప్రసాద్ ఎస్. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు ప్రస్తుతం ఆయన రూరల్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ విభాగంలో కమిషనరేట్ విభాగంలో పనిచేస్తున్నారు. కవిత ఎస్. మణ్ణికేరి ఐఏఎస్ 2015 బ్యాచ్‌కు చెందిన వారు. ఆమె ప్రస్తుతం స్టేట్ ఉమెన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. బళ్లారి, విజయనగర జిల్లాల డీసీలుగా పనిచేస్తున్న ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎం.ఎస్ దివాకర్‌కు ఎక్కడా స్థానం కేటాయించలేదు.



మహా వేడుక


ఏర్పాట్లపై మంత్రుల సమాలోచనలు


మంత్రులు, నాయకుల చలోక్తులు


సభా వేదిక వద్ద మంత్రులు, నాయకులు


సీసీ టీవీ ఫుటేజీల ద్వారా పోలీసుల పర్యవేక్షణ


డ్రోన్ల ద్వారా పరిశీలన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చారిత్రక ఘట్టానికి అనంతపురం సిద్ధమైంది. పది రోజుల వ్యవధిలో ఏకంగా 3.50 లక్షల మంది రాష్ట్ర ప్రజలను ఒక చోటకు చేర్చే మహాయజ్ఞం పూర్తి అయింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, మూడు పార్టీల నాయకులు నగరంలో తిష్ట వేసి.. చక చకా ఏర్పాట్లు చేయించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికలలో చాటిన ఐక్యతను హామీల అమలులో కొనసాగించారు. కేవలం 15 నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు ప్రధాన హామీలను అమలు చేసి.. సగర్వంగా జనం ఎదుటకు వస్తున్నారు అగ్ర నాయకులు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మూడు పార్టీల కీలక నాయకులు 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' సభకు వస్తున్నారు. ఈ వేడుకకు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జన తరంగాన్ని కలిపే మహా వేదిక శరవేగంగా రూపుదిద్దుకుంది. అధికారం చేపట్టింది మొదలు గడిచిన 15 నెలల్లో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలను తమ అధినేతలు ప్రజలకు వివరిస్తుంటే చూడాలని మూడుపార్టీల శ్రేణులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ భారీ బహిరంగ సభను బుధవారం నిర్వహిస్తున్నారు. అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీ జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్ ఇందుకు సిద్ధమైంది. మంత్రులు, మూడు పార్టీల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖ నాయకులు ఇప్పటికే అనంతపురం చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీలు, ఇతర అగ్రనాయకులు బుధవారం వస్తున్నారు. బహిరంగ సభ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగుతుంది.

ఇలా వెళ్లి.. అలా నిలపండి..

- ఉరవకొండ నియోజవర్గం నుంచి వచ్చే వాహనాలు కూడేరు మీదుగా బళ్లారి బైపాస్, తపోవనం సర్కిల్ నుంచి హైవే మీదుగా ప్రయాణించి.. విజయోత్సవ సభకు సమీపంలో కేటాయించి ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.
- రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలు ఆత్మకూరు మీదుగా కళ్యాణదుర్గం బైపాస్ అండర్ పాస్, సర్వీస్ రోడ్డులో వచ్చి రవి పెట్రోల్ బంకు వద్ద హైవేలో ప్రవేశించి, సభ వద్దకు చేరుకుని, సమీపంలోని ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.
- గుత్తి, గుంతకల్లు వైపు నుంచి వచ్చే వాహనాలను గార్లదిన్నె మీదుగా హైవేపై సభ వద్దకు వచ్చి, ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేయాలి.
- తాడిపత్రి నియోజవకర్గం నుంచి వచ్చే వాహనాలు నాయనపల్లి క్రాస్ మీదుగా 544-డి జాతీయ రహదారిపై ప్రవేశించి, వడియంపేట, నేషనల్ పార్కు వద్ద జాతీయ రహదారి 44లో ప్రవేశించి, సభ వద్దకు చేరుకుని.. ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో చేసుకోవాలి.
- శింగనమల నియోజవర్గం నుంచి వచ్చే వాహనాలు బుక్కరాయసముద్రం, చెరువుకట్ట, కలెక్టర్ కార్యాలయం, పంగల్ రోడ్డు, రాప్తాడు వై జంక్షన్ మీదుగా సభకు చేరుకోవాలి. సమీపంలోని కేటాయించిన ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేయాలి.
- కదిరి, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి నుంచి వచ్చే వాహనాలు సేతు స్కూల్ సమీపంలో.. రాప్తాడు వై జంక్షన్ మీదుగా సభకు చేరుకోవాలి. వీళ్లు కూడా ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.


ఏర్పాట్లపై చర్చిస్తున్న మండిపల్లి, పూల నాగరాజు, కలెక్టర్

ఇబ్బందుల్లేకుండా సూపర్ హిట్ చేయాలి
- మంత్రి మండిపల్లి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం వారు కలెక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రవాణా ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, భోజన వసతి ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను సభకు చేర్చే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో ఉండేలా చూడాలన్నారు. అలాగే సభ ముగిసిన అనంతరం ప్రయాణికులను వారి స్వస్థలాలకు క్షేమంగా చేర్చేవరకు పర్యవేక్షించాలన్నారు.

సర్వం సిద్ధం

'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి.. పడితే పట్టాలి రా హిట్ పట్టాలి' అంటూ బుధవారం జరిగే సభకు సర్వం సిద్ధం చేశారు. సుమారు 50 ఎకరాల్లో భారీ బహిరంగ వేదిక, ప్రజలు కూర్చోడానికి గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వేలాదిగా తరలివచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. సభా ప్రాంగణంలో తాత్కాలిక విశ్రాంతి కోసం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర ప్రముఖులు కోసం మూడు భారీ టెంట్లు ఏర్పాటు చేశారు. సభాప్రాంగణంతోపాటు, సభాస్థలికి వెళ్లే రహదారులు, గ్యాలరీల్లో క్షణ క్షణం పర్యవేక్షించానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నగరంలో ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వేలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వచ్చేశారు.. కీలక నాయకులు

టీడీపీ కూటమి నేతల పండుగ సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభలో పాల్గొనేందుకు అగ్రనాయకులు, అమాత్యులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, సవిత, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, సత్యప్రసాద్, మాజీ మంత్రులు, సుమారు 80 మంది వరకూ ఎమ్మెల్యేలు అనంతపురం చేరుకున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో నగరంలోని లాడ్జులు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు కిటకిటలాడుతున్నాయి.


సహకరించాలి: ఎస్పీ

సీఎం, డిప్యూటీ సీఎం, ప్రముఖల పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య లేకుండా అందరూ సహకరించాలని ఎస్పీ జగదీష్ కోరారు. వాహనదారులకు సూచించిన చోట పార్కింగ్ చేయాలని కోరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాల నుంచి అనంతపుర నగరానికి వచ్చే వేలాదిమంది వాహనదారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు.

నిఘా నీడలో నగరం

బహిరంగ సభకు లక్షలాది మంది తరలివస్తున్నందున పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాలతో పర్యవేక్షించనుంది. మొత్తం 55 డ్రోన్ కెమెరాలతో సభ భద్రతను పర్యవేక్షిస్తారు. మరో 250 సీసీ కెమెరాలతో సభా ప్రాంగణంలో అనుక్షనం నిఘా పెట్టనున్నారు. వీటికితోడు మరో 400 సీసీ కెమెరాలతో నగరం మొత్తం నిఘా వేశారు. వేలాది మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు.

పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఇదీ..



పుట్టపర్తిరూరల్/అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం అనంతపురంలో నిర్వహించే సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభకు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా ఆయన ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని మాదాపూర్ నివాసం నుంచి బయల్దేరి 11.25కి శంషాబాద్ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 11.30కి బయలుదేరి మధ్యాహ్నం 12.30కి పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో 12.40కి బయల్దేరతారు. అనంతపురం నగర పరిధిలోని కక్కలపల్లి హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం ఒంటి గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 1.05కు సభావేదిక వద్దకు చేరుకుంటారు. 2.00 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. తిరిగి సాయంత్రం 4.35కి అక్కడి నుంచి బయల్దేరి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 4.45కు హెలీక్యాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 6.15కు గన్నవరం చేరుకుంటారు. 6.20కి మంగళగిరి క్యాంపు కార్యాలయానికి బయలుదేరుతారు. రాత్రి 7.00 గంటలకు క్యాంపు కార్యాలయం చేరుకుంటారు.

సభకు వైసీపీ వాళ్లూ వస్తారు..

చంద్రబాబు పథకాలపై వారు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు: ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు టీడీపీ సానుభూతిపరులే కాకుండా సామాన్య ప్రజలు, వైసీపీ వాళ్లు కూడా వస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సభ విజయవంతానికి నియోజకవర్గ పరిశీలకులు ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి, ఆదోని కృష్ణమ్మతో కలిసి మండల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత మండలం నుంచే అధికంగా ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీలు ఇస్తే.. ఎలా అమలు చేస్తారంటూ వైసీపీ నేతలు హేళన చేశారన్నారు. ప్రస్తుతం హామీలన్నీ అమలు చేసి, అభినందన సభ నిర్వహిస్తుండడంతో వైసీపీ నాయకులు కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిటాల సునీత

సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేస్తాం: ఎమ్మెల్యే

శింగనమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డితో సభ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి మహిళలను భారీ ఎత్తున తరలించాలని ఎమ్మెల్యేకి సూచిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభను సూపర్ హిట్ చేసి చూపుతామని తెలిపారు. నియోజకవర్గం నుంచి 350 బస్సులను ఏర్పాటు చేశామని, ఆరు మండలాల నుంచి మహిళలు, కార్యకర్తలు, ప్రజలను తరలించడానికి సిద్ధం చేశామని వివరించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రులతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ఎమ్మెల్యేల ఇళ్లలో విందు

అమిలినేని ఇంట అల్పాహారం..
దగ్గుపాటి ఇంట విందు భోజనం
సందడి చేసిన మంత్రులు, అగ్రనేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు ఇళ్లలో సందడే సందడి. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అగ్రనాయకులు మంగళవారం ఎమ్మెల్యేల ఇళ్లకు క్యూ కట్టారు. వారికి ఎమ్మెల్యేల ఇళ్లలో వేర్వేరుగా విందు ఇచ్చారు. ఉదయం అమిలినేని అల్పాహార విందు ఇచ్చారు. శ్రీనగర్‌కాలనీలోని తన గృహం (బృందావనం)లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, వంగలపూడి అనిత, సవిత, సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, కిలారి రాజేష్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఏలూరు సాంబశివారెడ్డి, అరని శ్రీనివాసులు, అమర్‌నాథ్ రెడ్డి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు తదితరులకు అల్పాహార విందు ఇచ్చారు.

దగ్గుపాటి విందు భోజనం

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తన ఇంటి వద్ద ప్రముఖులకు మధ్యాహ్నం విందు ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, నారాయణ, గొట్టిపాటి రవి, రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు ఇతర ప్రముఖులు విందుకు హాజరయ్యారు. తర్వాత ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చించారు.


అల్పాహార విందు ఇస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


మధ్యాహ్నం విందు ఇస్తున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి

'పల్లె' నివాసానికి కూటమి నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డునందుగల మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఇంటికి పలువురు కూటమి నేతలు వెళ్లారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే రాధాకృష్ణ తదితరులు మాజీ మంత్రి ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, శ్రీబాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు. గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీశారు.


పల్లె కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న కొనకొండ్ల రాజేష్, నాయకులు

సూపర్‌హిట్ సభకు బీజేపీ రాష్ట్ర నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిప సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభకు బీజేపీ రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్ రాజు, ఈశ్వర్‌లతో పాటు రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే నగరానికి చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ స్వాగతం పలికారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ నేతలు, శ్రేణులు భారీ సంఖ్యలో హాజరవుతారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

జగన్.. నీకు సిగ్గుందా..?

ప్రతిపక్ష హోదా అడుక్కునేది కాదు..
ప్రజలు ఇచ్చేది
ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే.. అసెంబ్లీకి వస్తానంటున్న నీకు సిగ్గుందా..?' అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైరయ్యారు. ఆయన మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా అడుక్కునేది కాదనీ, ప్రజలు ఇచ్చేదన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చేది కాదన్నారు. ప్రస్తుతం డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిని అడిగి అయినా.. జగన్‌కు కావాలంటే ఆ పోస్టు ఇప్పిస్తామంటూ రాజు ఎద్దేవా చేశారు. ఇప్పటికే అన్నీ ఫిల్ చేశామనీ, జగన్ దరఖాస్తు చేసుకుంటే డైరెక్టర్ పోస్టు ఇస్తామన్నారు. రాయలసీమ గడ్డపైనే పుట్టి ఉండుంటే... జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. జగన్ ఆత్మగౌరవానికి ఏమాత్రం భంగం కలిగించమనీ, దమ్ము, ధైర్యం ఉంటే... అసెంబ్లీకి రావాలన్నారు. టీడీపీ, కూటమి ప్రభుత్వం, సూపర్ సిక్స్ పథకాలపై జగన్ ఎన్ని అబద్ధాలు చెప్పినా.. ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మద్యం కేసులో ఎంతోమంది అనంతపురం జిల్లా నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయన్నారు. త్వరలో నిగ్గు తేలిస్తే... జిల్లాకు పట్టిన దరిద్రం పోతుందన్నారు.

విప్, ఎమ్మెల్యేలకు సన్మానం

అనంతపురం క్రైం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు వచ్చిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పరిటాల సునీతను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సన్మానించారు. తన ఇంట్లో ఎమ్మెల్యే అమిలినేని.. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తర్వాత విందు ఇచ్చారు.


సన్మానం చేస్తున్న అమిలినేని

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విశ్వనాథ సత్యనారాయణ (జయంతి)



కవి సామ్రాట్, పద్మభూషణ్ గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం నందమూరు గ్రామంలో జన్మించారు. 'శ్రీమద్రామాయణ కల్ప వృక్ష' రచనకు తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ఘనత ఆయనదే. కావ్యాలు, కవితలు, నవలలు, నాటకాలు, పద్యకావ్యము, ప్రయోగాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు ఇలా ఆయన పాండిత్య ప్రతిభ జగమెరి గినది. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆస్థానకవిగా గౌరవించింది. కళాప్రపూర్ణ బిరుదు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందచేసింది. 1976 అక్టోబరు 18న కన్నుమూశారు.

డాక్టర్ సీఆర్ రావు (జయంతి)



పద్మ విభూషణ్ గ్రహీత డాక్టర్ కల్యంపూడి రాధాకృష్ణ రావు 1920 సెప్టెంబరు 10న కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా హూవినహడగలి గ్రామంలో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఇండో-అమెరికన్ మ్యాథమ్యాటీషియన్, స్టాటిస్టిషియన్, పెన్‌సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఎమెరిటస్‌గాను, యూనివర్సిటీ అట్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 2002లో నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్, ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా టాప్ 10 సైంటిస్టులలో ఒకరిగా నిలిచారు. ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మీదుగా వెళ్లే ఒక రోడ్డుకు ఆయన పేరు పెట్టారు. 102వ యేట 2023 ఆగస్టు 22న పరమపదించారు.

వడ్డాది పాపయ్య (జయంతి)




వడ్డాది పాపయ్య 1921 సెప్టెంబరు 10న శ్రీకాకుళంలో జన్మించారు. చిత్రకళా జగత్తును మకుటంలేని మహారాజులా నాలుగు దశాబ్దాలపాటు ఏలారు. ఆయన కుంచె పట్టిన తొలినాళ్లలో ప్రముఖ చిత్రకారులు రాజా రవివర్మ, దురంధర్‌ల ప్రభావం ఉండేది. తర్వాత తనదైన శైలిలో రాణించి ఇతరులెవరూ అనుకరించడానికి అవకాశం లేనివిధంగా చిత్రాలు గీశారు. మంచి రచయిత, ఫొటోగ్రాఫర్ కూడా. పలు మాస, వారపత్రికలకు ముఖచిత్రాలు గీశారు. ప్రత్యేకించి చందమామ, ఆంధ్రజ్యోతితోపాటు పలు పత్రికలలో చిత్రాలు ప్రచురితమయ్యాయి. 1992 డిసెంబరు 30న పరమపదించారు.

వై నాయుడమ్మ (జయంతి)



ప్రపంచప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ 1922 సెప్టెంబరు 10న గుంటూరు జిల్లా యలవర్రులో జన్మించారు. మద్రాస్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో శాస్త్రవేత్తగా చేసిన పరిశోధనలు మేళవించగా విజయవంతమయ్యాయి. అమెరికా దేశంలో చేసిన పరిశోధనలు కూడా ఫలించాయి. తిరిగి మాతృదేశానికి వచ్చి సెంట్రల్ లెదర్ రీసెర్చ్ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా చేరి లాభదాయక ప్రణాళికలు రూపొందించి చర్మకార పరిశ్రమను ఇతోధికంగా అభివృద్ధి చేశారు. ఈ సంస్థ జాతీయస్థాయికి ఎదిగింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి నాల్గో వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. పద్మశ్రీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1985 జూన్ 23న కన్నుమూశారు.

జాక్ మా (పుట్టినరోజు)



చైనా దేశ వ్యాపార దిగ్గజం జాక్ మా యన్ 1964 సెప్టెంబరు 10న జన్మించారు. పెట్టుబడి దారుడు. అలీబాబా గ్రూప్ సహ సంస్థాపకులు, మాజీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్. స్టార్టప్ పరిశ్రమలకు ఆయన రోల్‌మోడల్‌గా నిలిచారు. 2019లో ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ పవర్‌ఫుల్ వ్యక్తుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. 2021లో ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచపు శ్రీమంతులలో 26వ స్థానంలో నిలిచారు. విద్య, వైద్యం సహా పలు రకాల సమాజసేవ చేస్తూ మానవతావాదిగాను గుర్తింపు పొందారు. ఫౌండేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. బుద్ధిజం, టావోయిజంలను రెండింటినీ అనుసరించడం ప్రత్యేకత.

రైతులను ఆదుకున్నది సీఎం చంద్రబాబే

- మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు అన్నదాత సుఖీభవతో సంవత్సరానికి రూ.20 వేలతో పాటు రాయితీతో వ్యవసాయ పరికరాలు, ఎరువులను అందుబా టులోకి తెచ్చి రైతులను ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కు తుందని టీడీపీ మండల నాయకులు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజి నేయులు పేర్కొన్నారు. వైసీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమంపై మంగళవారం ఆయన మాట్లాడారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసి, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఏడాదిలోనే అన్ని పథకాలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత రాకుండా చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పథకాలైన తల్లికివందనం, స్త్రీశక్తి, అన్నదాతసుఖీభవ, పింఛన్లు పెంపు తదితరాలను అమలు పరిచి అన్నివర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సీఎం చంద్రబాబు కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

యువత జీవనానికి క్రీడలు ముఖ్యం: మంత్రి

▸▸ ఉత్సాహంగా జిల్లాస్థాయి దసరా క్రీడాపోటీలు ప్రారంభం



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న మంత్రి మునియప్ప

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువత బతుకులో క్రమశిక్షణ అలవరచుకోవడానికి విద్యతోపాటు క్రీడలు ముఖ్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప అభిప్రాయపడ్డారు. బెంగళూరు గ్రామీణ జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, యువజనులశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దొడ్డబళ్ళాపుర భగత్‌సింగ్ క్రీడామైదానంలో జిల్లాస్థాయి దసరా క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు కేవలం మనోరంజనకోసం కాదని శారీరక, మానసిక వికాసానికి దోహదపడ తాయన్నారు. ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడలకు సంబంధించి సలహాలను క్రీడా అధికారులనుంచి తెలుసుకోవాలన్నారు. క్రీడలలో గెలు పోటములు ముఖ్యం కాదని క్రీడాస్ఫూర్తితో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు మాట్లాడుతూ పిల్లల ప్రతిభను గుర్తించేందుకు క్రీడాపోటీలు సహకరిస్తాయన్నారు. విద్యార్థులు జిల్లాకీర్తిని ఇనుమడింపచేయాలన్నారు. ఆదినారాయణ హొసహళ్ళిలోని 20 ఎకరాలలో జిల్లా క్రీడామైదానం నిర్మించేందుకు గ్రాంట్లు విడుదల అయ్యాయన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని నాలుగు తాలూకాలనుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షాట్‌పుట్, ఫ్లైయింగ్ సాసర్, జావెలిన్ త్రో, 100 మీ, 200 మీ, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు సాగాయి. విజేతలకు మంత్రి, ఇతర ముఖ్యఅతిథులతో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దొడ్డబళ్ళాపుర నగరసభ అధ్యక్షులు సుమిత్ర ఆనంద్, ఘాటి సుబ్రమణ్య అభివృద్ధి ప్రాధికార సభ్యులు రంగప్ప, మహేశ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రవిసిద్ధప్ప, యువజనులశాఖ సహాయక డైరెక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం కోసం చందయ్య సేవలు అపారం

- పురసభ మాజీ సభ్యుడు నంజుండయ్య



ఏకగ్రీవంగా ఎన్నికైన నంజుండయ్యకు సన్మానం

విజయపుర, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పన్నెండో శతాబ్దంలో బసవణ్ణ సమకాలీనులైన నులియ చందయ్య సమాజంలో చైతన్యంకోసం ఎంతోకృషి చేశారని, కులమతబేధాలు లేని సమసమాజం కోసం ఆయన చేసిన సేవలు అపారమని పురసభ మాజీ సభ్యుడు వీ నంజుండయ్య అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం నగరేశ్వరస్వామి ప్రార్థనా మందిరంలో కొరమ-కొరచల సభలో ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం నులియ చందయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నంజుండయ్య మాట్లాడుతూ పన్నెండో శతాబ్దంలో బసవణ్ణ అనుచరుడిగా తమ జీవనం కోసం తాళ్లు, బుట్టలు అల్లడం వంటివి చేసేవారన్నారు. మిగిలిన మొత్తంలో దాసోహం చేసేవారన్నారు. బసవణ్ణ అనుభవమండపం సభ్యుడిగా 48కుపైగా వచనాలను రచించారన్నారు. ఉపాధ్యాయుడు జగదీశ్ మాట్లాడుతూ సమాజంలో ఏదైనా సాధించాలంటే, కార్యక్రమంలో జేసీబీ రమేశ్, నాగరాజ్, బేకరి మంజునాథ్, ఎన్ నందీశ్, గంగాధర్, సరస్వతి, చిరంజీవి పాల్గొన్నారు.

లాభాల బాటలో బూదికోటె పాల సహకార సంఘం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె పాల ఉత్పత్తిదారుల సహకారసంఘానికి లాభాలబాటలో ఉండడం అభినందనీయమని ఎమ్మెల్యే పాల సమాఖ్య డైరెక్టర్ ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం సంఘం నికరలాభం రూ.24 లక్షలకుపైగా ఉందన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం వచ్చాక లీటరు పాలకు రూ.5 ప్రోత్సాహక ధనం ఇస్తున్నారన్నారు. పాడిరంగానికి ఎంవీ కృష్ణప్ప అందించిన సేవలు అపారమన్నారు. డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్ళి గోవిందేగౌడ సుమారు 1,200 కోట్ల రూపాయలు వడ్డీరహిత రుణాలు అందించి విప్లవం సృష్టించారన్నారు. అయినా కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. పాల సహకారసంఘాలకు ఎన్నికలు ఆలస్యం కావడంతో ఈ ఏడాది మహిళలకు రుణాలు ఇవ్వడం సాధ్యం కాలేదన్నారు. వీఎస్ఎస్ఎన్ సొసైటీలు మరింత పురోగతి సాధించాల్సి ఉందన్నారు. హుణసనహళ్ళి రైల్వే బ్రిడ్జ్ నుంచి ఆనందగిరి వరకు డబుల్‌రోడ్డు చేస్తామన్నారు. అక్కడనుంచి గాజగదవరకు 5 మీటర్ల రోడ్డును 7 మీటర్ల రోడ్డు చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేకనిధి నుంచి రూ.6.5 కోట్లు మంజూరు చేయించానన్నారు. బూదికోటె గ్రామంలో సీసీరోడ్డు పనులు పెండింగ్ ఉండ రాదన్నారు. మీ గ్రామానికి రూ.50లక్షలు గ్రాంటు ఇస్తామన్నారు. సమావేశంలో పాల ఉత్పత్తదారుల సహకారసంఘం అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు నారాయణ, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, పాల సమాఖ్య మేనేజర్ గిరీశ్‌గౌడ, విస్తరణాధికారి భానుప్రకాశ్, సహకారి అభివృద్ధి అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాలలో స్వచ్ఛతా అభియాన



స్వచ్ఛతా అభియానలో నగరసభ కమిషనర్ శ్రీధర్

ముళబాగిలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఉద్యానవనాలలో స్వచ్ఛతా అభియాన నిర్వహించారు. నగరసభ ఆధ్వర్యంలో నెహ్రూ ఉద్యానవనం, సోమేశ్వర ఉద్యానవనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉద్యానవనంలో మంగళవారం కార్యాచరణ చేపట్టారు. నగరసభ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ స్వచ్ఛత కేవలం పౌరకార్మికుల పని మాత్రం కాదని, ప్రజలు కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ ఇంజనీర్ మహేశ్, సీనియర్ ఆరోగ్య అధికారి ప్రతిభ, జూనియర్ ఆఫీసర్ శివారెడ్డి, అమృత, రెవెన్యూ అధికారి నారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుస్తీ పోటీలు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అశ్వత్థనారాయణస్వామి

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హెచ్ఎస్ఆర్ లే అవుట్ పరిధిలోని ఐటీఐ లే అవుట్ మైదానంలో కుస్తీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కేపీసీసీ సభ్యుడు సయ్యద్ సర్దార్ ఆధ్వర్యంలో సాగాయి. మాజీ ఎంపీ కుపేంద్రరెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలుగా ప్రారంభమైన కుస్తీ పోటీలు క్రమేపీ పట్టణం, నగరాలకు చేరుకున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు సహకారం అందిస్తాయన్నారు. వివిధ ప్రాంతాలనుంచి పోటీలలో మొత్తం 45 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ట్రోఫీలు అందచేసి అభినందించారు. కాగా పోటీలలో పాల్గొన్నఅందరికీ ప్రశంసాపత్రాలు అందచేశారు. పహిల్వాన్‌ల సలహా సూచనలు పాటించి నిర్వహించామని సయ్యద్ తెలిపారు. తొలిసారిగా నిర్వహించగా మంచి స్పందన వచ్చిందన్నారు. మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, స్థానిక నాయకుడు టీ వాసుదేవరెడ్డి, రవీంద్ర, అశ్వత్థ నారాయణ స్వామి, సయ్యద్ సలాం తదితరులు పాల్గొన్నారు.

గృహాలంకరణకు పెరుగుతున్న ప్రాధాన్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గోపాలయ్య తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆధునికతకు అనుగుణంగా గృహాలంకరణకు ప్రాధాన్యత పెరుగుతోందని మహాలక్ష్మి లే అవుట్ ఎమ్మెల్యే కే గోపాలయ్య అభిప్రాయపడ్డారు. రాజాజినగర్‌లో ఆస్ట్రియన్ ఫర్నీచర్ ఫిట్టింగ్ సంస్థ బ్లూమ్ ఇన్‌స్పిరేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ వాస్తు విన్యాసాలకు అనుగుణంగా అలంకరణలు అందుబాటులో ఉండడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ ఫిలిప్‌బ్లూమ్, వెరా ఎంటర్‌ప్రైజెస్ యజమాని సాకిబ్‌మాలిక్, నృపేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా

- అప్పులమయమైన రాష్ట్రానికి ఆక్సిజన్‌లా సీఎం
- సహకార సంఘం అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న హరిప్రసాద్

కొత్తచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో అ ప్పులమయమైన రాష్ట్రానికి సీఎం చంద్రబాబు ఆక్సిజన్‌లా మారి, పరిస్థి తులను గాడిలో పెడుతున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో కొత్తచెరువు ప్రాథ మిక సహకార సొసైటీ అధ్యక్షుడిగా అప్పకొండప్పగారి హరిప్రసాద్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని మంగళవారం సొసైటీ సీఈఓలు నిర్వహించారు. ము ఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాజీ సీఎం జగన్, ఆయన కో టరీ దోచుకుని దాచుకోవడంతో రాష్ట్రం అప్పులమయం అయిందన్నారు. రై తులు, ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి వ చ్చిన 15నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వంద శాతం సూపర్‌హిట్ చేసిందన్నారు. బుధవారం అనంతపురంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున పార్టీశ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబు కూటమి నాయకులకు సమ ప్రాధాన్యమి స్తూ పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులను ఇస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం విశ్రాంత ఉపాధ్యాయుడు హరిప్రసాద్ అన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు హరిప్రసాద్, డైరెక్టర్లు లక్ష్మీదేవి, అహమ్మద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ... త నపై నమ్మకంతో ఈ పదవి అప్పచెప్పిన మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు అందు బాటులో ఉండి తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, శీన, మాజీ ఎంపీపీ వాణి, పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూలశివ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సాగునీటి సంఘం అధ్యక్షువడు పీవీ నవీన్‌కుమార్, బీజేపీ నాయకులు శేషాద్రినాయుడు, దివ్యతేజ, మాజీ సర్పంచ్‌లు హరినాథ్‌చౌదరి, మాణిక్యంబాబా, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణప్ప, వెంగన్న, శివయ్య, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసిన మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మాజీ ప్రధాని దేవెగౌడ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉప ఎన్నికల్లో రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్న అగ్రనేతలు ఓటు వేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ముఖ్యనేత జయరాం రమేశ్, బీజేపీకి చెందిన జగ్గేశ్, ఈరణ్ణ కడాడి, లెహర్‌సింగ్ సిరోయా, నారాయణ భాండగె, కె నారాయణతోపాటు కాంగ్రెస్‌కు చెందిన అజయ్ న్యాకెన్, సయ్యద్ నాసిర్ హుసేన్, జీసీ చంద్రశేఖర్‌లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రం నుంచి 28మంది లోక్‌సభ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 9మంది కాంగ్రెస్ వారు కాగా ఇరువురు జేడీఎస్‌తో కలిపి 17మంది బీజేపీ ఎంపీలు ఓటు వేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్, చలవాది నారాయణస్వామి తదితరులు ఢిల్లీకి వెళ్లారు. సోమవారం రాత్రి పార్టీ ఎంపీలతో ప్రత్యేక సమావేశం జరిపి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. జేడీఎస్ నుంచి కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారు. వారిలో కేంద్రమంత్రి కుమారస్వామి కాగా కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు ఉన్నారు. అయితే కాంగ్రెస్ నుంచి రాష్ట్రానికి చెందిన కీలకనేతలు ఎవరూ ఢిల్లీకి వెళ్లలేదు.

వరల్డ్ మాస్టర్స్ ఓరియంటీరింగ్‌లో రాణించిన శ్రీధర్



జాతీయ పతాకంతో శ్రీధర్

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్పెయిన్‌దేశంలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ ఓరియంటీరింగ్ చాంపియన్‌షిప్‌లో బెంగళూరుకు చెందిన సాయిశ శ్రీధర్ కిరణ్ రాణిం చారు. క్యాటలాన్ ఓరియంటీరింగ్ ఫెడరేషన్, స్వీడెన్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ పోటీలు జరిపింది. 50 దేశాల నుంచి 3వేల మందికి పైగా పోటీలలో పాల్గొన్నట్టు శ్రీధర్ తెలిపారు. భారత్‌నుంచి ఒక్కరే పాల్గొన్నానని దీన్ని థింకింగ్ స్పోర్ట్స్ అని పిలుస్తారన్నారు. వందేళ్లుగా స్వీడెన్‌లో చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయన్నారు. 2024లో ఇండో నేషియాలో జరిగిన పోటీలలో ఒక బంగారం, రెండు వెండి పతకాలు సాధించానని, థాయ్‌ల్యాండ్, సింగపూర్‌లలో ఏషియన్ రీజియన్ పోటీలలోనూ చాంపి యన్‌గా నిలిచానన్నారు. ఈ అనుభవమే ప్రపంచస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. 2029లో ప్రపంచస్థాయి పోటీలలో పాల్గొంటాన న్నారు. నా ధైర్యం భవిష్యత్తు మరింతమందికి స్ఫూర్తినిస్తుందని అన్నారు.

వినియోగదారుల విశ్వాసంతోనే ప్రగతి

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల విశ్వాసంతోనే ప్రగతి సాధ్యమని శ్రీస్టార్ గోల్డ్ అంబాసిడర్ నటి అంజలి అభిప్రాయపడ్డారు. బంగారం ధరలు అమాంతం పెరుగుతున్నాయని అందుకు తగ్గట్టుగా వ్యాపారసంస్థలు కూడా పెరిగాయన్నారు. ఆరేళ్లుగా ప్రగతిదశలో చేరేందుకు విశ్వాసమే కారణమన్నారు. కంపెనీ ముఖ్యులు శ్రీకాంత్ మాట్లాడుతూ వినియోగదారులకు ఆరేళ్లలో మెరుగైన సేవలు అందించామన్నారు. ఆల్‌ఇన్‌వన్ పరిష్కారసేవలను విస్తరింపచేదలచినట్టు తెలిపారు.

బంగ్లాదేశ్ మహిళను రక్షించిన పోలీసులు

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ నుంచి అక్రమ మార్గంలో బెంగళూరుకు రప్పించుకుని వేశ్యావాటిక దందాలో చేర్చిన బంగ్లాదేశ్ మహిళను హుళిమావు పోలీసులు రక్షించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆమె దందానుంచి రక్షించాలని వేడుకున్నారు. పోలీసులు ఆమెనుంచి వివరాలు సేకరించారు. భారత్‌లో ఉద్యోగాలు లభిస్తాయని బంగ్లాదేశ్‌నుంచి వివిధ ప్రాంతాలమీదుగా తీసుకొచ్చారన్నారు. తొలుత బ్యూటీ పార్లర్‌లో పనికోసం చేర్పించారన్నారు. 15-20 వేలరూపాయలు జీతం ఇచ్చారన్నారు. ఇటీవల హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ఓ ఇంటికి తీసుకెళ్లారన్నారు. అక్కడ వేశ్యావాటిక నిర్వహిస్తున్నట్టు గుర్తించామన్నారు. మానసికంగా హింసించారన్నారు. ఇద్దరు వ్యక్తులతో కలసి కారులో తీసుకెళ్లారన్నారు. బన్నేరుఘట్ట రోడ్డులో ఓ ఇంటికి తీసుకెళ్లి మద్యం సేవించారన్నారు. తననువారు బుక్ చేసుకున్నట్టుగా తెలిసి వారినుంచి తప్పించుకుని పరుగు తీశానన్నారు. బయటకు వచ్చాక స్థానికుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్టు తెలిపారు. బంగ్లాదేశ్‌లో పెళ్లి అయ్యిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, తమ దేశానికి పంపాలని ఆమె వేడుకున్నారు. అయితే బంగ్లాదేశ్‌కు వాపసు పంపే విషయమై పరిశీలించాల్సి ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సంబరంగా గణేశ్ ఉత్సవం



స్థానిక ప్రముఖులను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశ్వవినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హెచ్ఎస్ఆర్ లే అవుట్ వాజ్‌పేయ్ క్రీడామైదానంలో ఉత్సవాలు సాగుతున్నాయి. ధర్మస్థల ఆలయ నమూనా మండపం రూపొం దించారు. ఐదురోజుల ఉత్సవాలలో నృత్యం, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటున్నాయని శ్యామ్ తెలిపారు. చిన్మయస్కూల్ ముఖ్యులు వాసుదేవరెడ్డి, టీ వాసుదేవరెడ్డి, అనిల్, వెంకటేశ్‌రెడ్డితోపాటు గోపీనాథరెడ్డి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



లిక్కర్ నిందితుల రిమాండ్ పొడిగింపు

» ఏడుగురికి 12 వరకు పొడిగించిన ఏసీబీ కోర్టు

విజయవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఏడుగురు నిందితులకు రిమాండును ఈనెల 12వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. విజయవాడలోని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు మంగళవారం ఈ ఉత్తర్వులు ఇచ్చారు. రిమాండ్ గడువు ముగియడంతో విజయవాడలోని జిల్లాజైలులో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, బూనేటి చాణక్య, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, గుంటూరు జైల్లో ఉన్న బాలాజీ యాదవ్, నవీన్‌కృష్ణలను మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఈ ఏడుగురికి రిమాండ్‌ను పొడిగించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళ్లడంతో ఆయన కోర్టుకు హాజరుకాలేదు. ఆయన ఈనెల 11వ తేదీ సాయంత్రం జైలు అధికారుల ఎదుట లొంగిపోవాల్సి ఉంది. అలాగే, బెయిల్‌పై విడుదలైన కె.ధనుంజయ్ రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, పైలా దిలీప్ వేర్వేరుగా కోర్టుకు హాజరయ్యారు. వీరికి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ సిట్ అధికారులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై స్టే ఇచ్చిన హైకోర్టు ఈనెల 11వ తేదీన తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. కోర్టు హాల్లో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.11 కోట్లను ప్రస్తావించారు. ఆ డబ్బుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. అయితే, దీనిపై ఇప్పటికే కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని చదువుకోవాలని కసిరెడ్డికి న్యాయాధికారి సూచించారు.

పీఎస్ఆర్, కాంతి రాణా సస్పెన్షన్ పొడిగింపు


పీఎస్ఆర్


కాంతి రాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీపై అక్రమ కేసు బనాయించి ఆమెతోపాటు కుటుంబ సభ్యులను వేధించిన కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ నెల 2న సమావేశమైన రివ్యూ కమిటీ కేసు దర్యాప్తుపై ఆరా తీసింది. ఇంకా పూర్తి కానందున సస్పెన్షన్ ఎత్తేస్తే సీనియర్ ఐపీఎస్ అధికారులు దర్యాప్తుపై ప్రభావం చూపించే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది. దీంతో 2026 మార్చి 8 వరకూ సస్పెన్షన్ పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే కేసులో సస్పెండైన మరో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ తనకు పోస్టింగ్ ఇప్పించాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

వివేకా హత్య కేసు విచారణ 16కు వాయిదా

» గత విచారణలో సుప్రీంకోర్టు ప్రశ్నలపై అఫిడవిట్ దాఖలుకు సమయం కోరిన సీబీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. సీబీఐ విజ్ఞప్తితో కేసును సుప్రీంకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది. గత విచారణ సందర్భంగా.. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? నిందితుల కస్టోడియల్ విచారణ చేయాలా? వద్దా? నిందితుల్లో ఎంత మంది బెయిల్ రద్దు చేయాలో తెలియజేయాలని, ప్రతి అంశానికి సంబంధించి సమగ్ర వివరణ ఇవ్వాలని న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. అయితే మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం ఎదుట కేసు విచారణకు రాగా.. అఫిడవిట్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసును సెప్టెంబరు 16న మధ్యాహ్నం 2 గంటలకు విచారిస్తామని తెలిపింది.

అధికారం.. డబ్బు.. విషం!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ మద్యం అంశాన్ని ఎలా వాడుకున్నారో ఈ భాగం వివరిస్తుంది. నాటి ఎన్నికల ప్రచారంలో.. మందు అనేది లేకుండా చేస్తానని ఆయన చెప్పిన వీడియో క్లిప్‌ను చూపిస్తూ, ఆ తర్వాత ఆ హామీని ఎలా తుంగలో తొక్కారో వివరించారు. ప్రజలు మద్యం తాగకుండా చేసేందుకు మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచుతానంటూ కల్లిబొల్లి మాటలు చెబుతూ.. నిబంధనలను తనకు ఇష్టం వచ్చినట్లు మార్చేస్తూ.. ప్రజలకు చీప్ లిక్కర్‌ను అధిక ధరలకు అమ్ముతూ.. ప్రభుత్వ ఖజానాను ఎలా కొల్లగొట్టారో పేర్కొన్నారు. శ్రీ క్యాపిటల్స్, రాయల్ లైట్, స్పెషల్ స్టేటస్ అంటూ పిచ్చి పిచ్చి పేర్లతో పిచ్చి బ్రాండ్లను నాసిరకం మద్యాన్ని మాత్రమే అందుబాటులో ఉంచి ప్రజల ప్రాణాలు పణం పెట్టి వేల కోట్లు సంపాదించిన వైనాన్ని వివరించారు. ఇలా సంపాదించిన మద్యం డబ్బును 2024 ఎన్నికల్లో ఖర్చు పెట్టి మరోసారి అధికారంలోకి రావడానికి జగన్ చేసిన ప్రయత్నాన్నీ వివరించారు. మద్యం కుంభకోణంలో అసలు ఏం జరిగింది. అక్రమాల తీరు.. వైసీపీ పెద్దలు డబ్బులు దండుకుని వాటిని ఎక్కడెక్కడికి తరలించా రు.. ఎవరెవరు మద్యం కుంభకోణంలో భాగస్వాములుగా ఉన్నారు వంటి అనేక అంశాల ను వివరించారు. మద్యం డబ్బుతో సినిమాల నిర్మాణం.. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు.. బంగారు బిస్కట్లు.. విదేశాల్లో ఖరీదైన విల్లాల కొనుగోలు చేసిన తీరును ప్రస్తావించారు. మద్యం కారణంగా ఆరోగ్యాలు పాడుచేసుకున్న బాధితుల దీన పరిస్థితిని వారి మాటల్లోనే చూపారు. 'ఎన్నో సమాధానాలు దొరకని ప్రశ్నలు' అంటూ తొలి భాగాన్ని ముగించారు. దీన్ని యూట్యూబ్‌తోపాటు వివిధ సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచనున్నారు.

రెండో భాగంలో... మద్యం డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించారన్న అంశాలను వివరించారు.

మూడో భాగంలో... మద్యం పేరుతో విషాన్ని ప్రజలతో ఎలా తాగించారు....దాని వల్ల ప్రజల ప్రాణాలతో ఎలా చెలగాటమాడారన్న విషయాలను ప్రస్తావించారు.

కోవూరులో మద్యం స్కాం లింకులు!

» ఆ సొమ్ముతో స్థలం కొనుగోలుపై సిట్ ఆరా

» ధనుంజయ్ రెడ్డి బంధువును విచారించిన అధికారులు


కోవూరులో ధనుంజయ రెడ్డి బంధువు దేగపూడి ప్రభాకరరెడ్డిని విచారిస్తున్న సిట్ అధికారులు

కోవూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కుదిపేస్తున్న మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) అధికారులు నెల్లూరు జిల్లా కోవూరులో ఓ రియల్టర్‌ను రహస్యంగా విచారించారు. కోవూరు పట్టణానికి చెందిన రియల్టర్ దేగపూడి ప్రభాకరరెడ్డి మద్యం కేసులో నిందితుడైన ధనుంజయ రెడ్డికి సమీప బంధువు. వైసీపీ ప్రభుత్వంలో ధనుంజయ్‌రెడ్డి ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసే సమయంలో కోవూరులో 80 అంకణాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల ధనుంజయరెడ్డి ఆస్తులపై సిట్ దృష్టి సారించడంతో కోవూరులో ఆయన స్థలం కొనుగోలు చేసిన విషయం వెలుగు చూసింది. దీంతో సిట్ అధికారులు మంగళవారం కోవూరు వచ్చి ప్రభాకరరెడ్డిని విచారించారు. అంకణం ఎంతకు కొన్నారు? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? అనే విషయాలను రాబట్టారు. మార్కెట్ ధర ప్రకారమే ప్లాటును కొన్నట్టు ప్రభాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసులో మరో నిందితుడు కృష్ణమోహన్‌రెడ్డి కూడా కోవూరు, విడవలూరు మండలాల్లో పొలాలు కొనుగోలు చేశారని సిట్‌కు సమాచారం అందింది. వాటిపైనా త్వరలో విచారించనున్నారు.

తెలుగు జాతికి చీకటి రోజు!

» ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆరెస్సెస్ వాదికి ఓటేస్తారా?

» టీడీపీ, జనసేన, వైసీపీపై షర్మిల విమర్శలు



అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు టీడీపీ, జనసేన, వైసీపీ ఓటేసిన మంగళవారం తెలుగు జాతికి చీకటి రోజు అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆత్మగౌరవమే అజెండా అని తెలుగుదేశం, పదవుల కన్నా జాతి ప్రయోజనం ముఖ్యమని జనసేన ప్రకటించాయని గుర్తుచేశారు. తెలుగే లెస్స అని చిలక పలుకులు పలికిన వైసీపీ తెలుగు జాతికి తీరని ద్రోహం చేసిందని మంగళవారం 'ఎక్స్' పోస్టులో విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అత్యున్నత పదవికి తెలుగు బిడ్డ పోటీపడితే.. ఆరెస్సెస్ వాదికి ఓటు వేయించిన మూడు పార్టీల అధ్యక్షులు చరిత్రహీనులని అన్నారు. ఇది జాతీయస్థాయిలో తెలుగుజాతికి జరిగిన ఘోర అవమానమని షర్మిల పేర్కొన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసిన మోసం కనిపించలేదా అని ప్రశ్నించారు. మరోవైపు ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీ బలపరచిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఓటేసి.. వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచారని ఏఐసీసీ కార్యదర్శి మాణిక్కం ఠాకూర్ ఆరోపించారు.

ఆ పదవికి గౌరవాన్ని తెస్తారు

» ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు

» ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ.. 'జాతికి సేవ చేసేందుకు వచ్చిన అవకాశంలో మీరు విజయం సాధిస్తారని నమ్ముతున్నా. ప్రజాస్వామిక విలువలను కాపాడటంలో మీకు ఉన్న అపారమైన అనుభవం దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది' అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ... 'ఆయన అనుభవం, ఆదర్శవంతమైన రాజనీతిజ్ఞత ఉపరాష్ట్రపతి పదవికి గౌరవాన్ని తెస్తాయి. రాజ్యసభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆయన కృషి చేస్తారు' అని ఆకాంక్షించారు. కాగా మంత్రి లోకేశ్, ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ ఓ ప్రకటనలో.. అభ్యుదయ భావాలు కలిగిన రాధాకృష్ణన్ సేవలు ఇకపై దేశానికి ఉపయోగపడనున్నాయని అన్నారు.

రైతుల్లేని వైసీపీ పోరు

» జగన్ పిలుపును పట్టించుకోని అన్నదాతలు

» ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసనలకు రాష్ట్రవ్యాప్తంగా స్పందన కరువు

» ఇంటికే పరిమితమైన వైసీపీ అధ్యక్షుడు


అనంతపురం నగరంలో నిర్వహించిన ర్యాలీలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, శైలజానాథ్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలపాలన్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపును రాష్ట్రవ్యాప్తంగా రైతులెవరూ పట్టించుకోలేదు. మంగళవారం 'అన్నదాత పోరు' పేరుతో ఆ పార్టీ నిర్వహించిన ఆందోళనల్లో అన్నదాతలు కనిపించలేదు. పోరుకు పిలుపునిచ్చిన జగన్.. తాడేపల్లిలో నివాసానికే పరిమితమయ్యారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలే పాల్గొని మమ అనిపించారు. పలుచోట్ల సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కూడా డుమ్మా కొట్టారు. రైతుల నుంచి స్పందన లేకపోవడంతో పలుచోట్ల వైసీపీ నేతలే రైతుల్లా కండువాలు కప్పుకుని ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లారు. యూరియా కొరత తీర్చాలంటూ వినతిపత్రాలు ఇచ్చేసి వచ్చేశారు. ఇబ్రహీంపట్నం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి జోగి రమేశ్ రెచ్చిపోయి వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు ఆయన్ను కట్టడి చేశారు. దీంతో పక్కనే ఉన్న గాంధీబొమ్మకు వినతిపత్రం ఇచ్చేసి జోగి రమేశ్ వెనుదిరిగారు. పుంగనూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతిలో అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, అనకాపల్లిలో గుడివాడ అమర్నాథ్, నందిగామలో దేవినేని అవినాశ్‌రెడ్డి తదితరులు పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోదావరి జిల్లాలో యూరియా కొరత లేకపోవడం, ఈ జిల్లాల్లో వాడకం కూడా తగ్గడంతో వైసీపీ పిలుపును రైతులు ఏమాత్రం పట్టించుకోలేదు. ఆందోళనలకు వీల్లేదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేయడంతో.. శాంతియుతంగా అన్నదాత పోరు చేస్తామంటూ వైసీపీ నేతలు ప్రకటించారు. శాంతియుత ర్యాలీలకు పోలీసులు అనుమతిని ఇచ్చినా కూడా పలుచోట్ల వైసీపీ శ్రేణులే ముఖం చాటేశాయి. అధికారాన్ని కోల్పోయాక వరుసగా రైతు పోరు పేరిట జగన్ ఇస్తున్న పిలుపునకు రైతుల నుంచిగానీ, సొంత పార్టీ నేతల నుంచిగానీ స్పందన రావడం లేదు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కీలక సన్నివేశాల చిత్రీకరణ



సాయి దుర్గాతేజ్ కథానాయకుడిగా రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం కీలక షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్న ఓ బాలీవుడ్ స్టార్‌తో సాయి దుర్గాతేజ్ తలపడతారు. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన సీజీఐ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. సినిమాను తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.



ఒకే తెరపై మీ ఇద్దరూ.. అద్భుతం!

అల్లు అర్జున్

మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిగా వంశీకృష్ణ మల్లా తెరకెక్కిస్తున్న చిత్రం 'దక్ష'. 'ద డెడ్లీ కాన్సిరసీ' అనేది ఉపశీర్షిక. మోహన్‌బాబు, సముద్రఖని, సిద్ధిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ చిత్రం ట్రైలర్‌ను సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. 'నా మిత్రురాలు, ఆప్తురాలైన లక్ష్మీ మంచుకు శుభాకాంక్షలు. మీరు, మోహన్‌బాబు గారు ఒకే తెరపై కనిపించడం అద్భుతంగా అనిపిస్తోంది. చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

'మిరాయ్'ను కుటుంబంతో చూడాలి



'ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో 'మిరాయ్' సినిమాపై ఆసక్తి పెరిగింది. తప్పకుండా ఈ సినిమాను చూడాలనే కుతూహలాన్ని వారికి కలిగించింది. తద్వారా 'మిరాయ్' చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విడుదలకు ముందే చక్కని స్పందన వచ్చింది. ప్రేక్షకులు వారి కుటుంబంతో కలసి 'మిరాయ్'ను చూడాలనేది మా కోరిక. అందుకే టికెట్ ధరలను పెంచడం లేదు' అని నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ 'మిరాయ్' విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- నిర్మాణ వ్యయం గురించి ఆలోచించకుండా, నేను చాలా లోతుగా ఇన్‌వాల్వ్ అయి చేసిన సినిమా ఇది. మార్కెట్ లెక్కలు వేసుకోకుండా మా బేనర్ నుంచి ఒక ఎక్స్‌ట్రార్డినరీ సినిమా ఇవ్వాలని ఈ చిత్రాన్ని నిర్మించాం. మిరాయ్ ఒక అద్భుతమైన ఫాంటసీ అడ్వెంచర్.
- చరిత్రకు కాల్పనికతను జోడించిన కథ ఇది. అశోకుడు తొమ్మిది పుస్తకాల్లో తన జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడం, వాటి సంరక్షణను యోధులకు అప్పగించడం, అందులో ఒక పుస్తకం రక్షణ కోసం హీరో, విలన్ మధ్య ఎలాంటి పోరాటం జరిగిందనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. అలాగే తల్లి సంకల్పంతో ముడిపడిన కథ ఇది. ఈ సినిమాలో లొకేషన్లు, గ్రాఫిక్స్ ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇస్తాయి.
- ఈ సినిమా కోసం తేజ చాలా కష్టపడ్డాడు. యాక్షన్ కోసం థాయ్‌లాండ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అలాగే మనోజ్ ప్రతి నాయకుడిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు.
- ప్రభాస్ 'రాజాసాబ్' చిత్రాన్ని జనవరి 9న విడుదల చేస్తున్నాం. కాంతార 2 చిత్రంతో కలిపి ట్రైలర్‌ను, ప్రభాస్ పుట్టిన రోజున ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

అవన్నీ వదంతులే

- కాజల్ అగర్వాల్



'నేను ప్రమాదానికి గురైనట్లు సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన వార్తలు చూశాను. ఇక లేనని కూడా ప్రచారం చేశారు. అవన్నీ వదంతులే. వాటిని చూసి ఎంతో నవ్వుకున్నాను' అని పేర్కొన్నారు కథానాయిక కాజల్ అగర్వాల్. ఆమె ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో పోరాడుతోందని కొన్ని సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ వార్తలపై అభిమానులను ఉద్దేశిస్తూ కాజల్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దేవుని దయవల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని, ప్రచారం చెయ్యొద్దని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం 'రామాయణ' సినిమాలో నటిస్తున్నారు.

ప్రేమానుభూతితో సాగే పాట



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటిస్తోన్న కొత్త సినిమా 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 18న విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం నుంచి 'కలలే కలలే కనులకు నువ్వు కనబడి కలలే...' అంటూ ప్రేమానుభూతితో సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. భాస్కరభట్ల రాసిన ఈ గీతానికి చైతన్య భరద్వాజ్ స్వరాలు సమకూర్చగా కపిల్ కపిలన్ ఆలపించారు.

ఇంత విషం ఇప్పించండి


● కన్నడ హీరో దర్శన్ కంటతడి



'వెలుగును చూసి 30 రోజులు అయింది. జైలులో ఉండలేకపోతున్నాను. నాకు ఇంత విషం ఇప్పించండి' అని కన్నడ హీరో దర్శన్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో ఆయన నిందితుడు. పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయనను బెంగళూరు 57వ సీసీహెచ్ కోర్టు ఎదుట మంగళవారం వర్చువల్‌గా హాజరుపరిచారు. పరప్పన అగ్రహార జైలు నుంచి దర్శన్‌ను బళ్లారి జైలుకు పంపే పిటిషన్‌పై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. వర్చువల్‌గా హాజరైన దర్శన్.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని చెయ్యి ఎత్తారు. దీంతో న్యాయాధికారి ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆ సమయంలో ఉద్వేగానికి లోనైన దర్శన్, వెలుగును చూసి 30 రోజులైందని, చేతులకు ఫంగస్ వచ్చిందని వివరించారు. ఇతర నిందితులతో నిమిత్తం లేదని, తనకు మాత్రం కొంచెం విషం ఇప్పించాలని కోరారు. అలాంటి మాటలు మాట్లాడవద్దని, సౌలభ్యాలు, సమస్యల గురించి మాత్రమే చెప్పాలని న్యాయాధికారి దర్శన్‌కు సూచించారు. అనంతరం పిటిషన్ విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దర్శన్‌ను బెంగళూరు జైలులోనే ఉంచాలని, అవసరమైన పరుపు, తలగడ సమకూర్చాలని, జైలులో అటూ ఇటూ తిరిగేందుకు అవకాశం కల్పించాలని న్యాయాధికారి ఆదేశించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విలక్షణమైన కథలతో వస్తున్నాం



'ప్రస్తుతం మా 'భీమవరం టాకీస్' పతాకంపై పలు చిత్రాలు నిర్మిస్తున్నాం. అందులో 'యండమూరి కథలు', 'కెవీహెచ్‌బీ కాలనీలో', 'మా నాన్న హీరో', 'మహానాగ' తదితర చిత్రాల రెగ్యులర్ షూటింగ్ మొదలైంది' అని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. తమ నిర్మాణ సంస్థలో రూపొందుతున్న కొత్త సినిమాల వివరాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. 'మా బేనర్‌పై వరుస చిత్రాలు చేస్తున్నాం. త్వరలో ప్రముఖ దర్శకుడితో భారీ బడ్జెట్‌తో ఓ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మరికొన్ని చిత్రాలు పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా విలక్షణమైన కథలతో కామెడీ, సోషల్, డ్రామా, హారర్.. ఇలా విభిన్న జానర్లలో ఈ చిత్రాలు ఉంటాయి' అని చెప్పారు.

